ఫ్రాన్సిస్ పాల్‌కు నివాళి



ఫ్రాన్సిస్ పాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న క్రైస్తవ ప్రముఖులు

రాంగోపాల్‌పేట్: వైఎస్సార్‌టీపీకి చెందిన సీనియర్ క్రిష్టియన్ మైనార్టీ నాయకులు ఫ్రాన్సిస్ పాల్(37)కు పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. సైనిక్‌పురికి చెందిన ఫ్రాన్సిస్ పాల్ వైఎస్సార్‌టీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతదేహాన్ని సికింద్రాబాద్‌లోని సెయింట్ థామస్ ఎస్పీజీ చర్చికి తీసుకురాగా బిషప్ సింగం, శంకర్ లూక్, పీవీ యోహాన్, పాస్టర్ స్టీవెన్, శ్రీకాంత్, పాస్టర్ క్రిస్, సుమలత దినకర్, ప్రవీణ్ తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పోలింగ్ చిట్టీల అందజేత



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ ఓటర్లకు చిట్టీలు పంపిణీ చేశారు. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల్లో ఏర్పాటు చేసిన 54, 56. 68, 69 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఓటర్లు రాగా అక్కడ ఏర్పాటు చేసిన టేబుల్ వద్ద కూర్చుని నాగేష్ చిట్టీలు అందజేశారు.

పోలింగ్.. ప్రశాంతం

లష్కర్, సనత్‌నగర్ కంటోన్మెంట్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

సాయంత్రానికి బారులుదీరిన ఓటర్లు

వృద్ధులు, వికలాంగులు సైతం పోలింగ్‌కు హాజరు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మెట్టుగూడ డివిజన్ చింతబావి పోలింగ్ కేంద్రంలో ఒక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ గంటపాటు మొరాయించడం మినహా పోలింగ్ విషయంలో ఎక్కడా అవాంతరాలు జరగలేదు. ఉదయం 8 గంటల నుంచి 11 వరకు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు నియోజకవర్గం మొత్తం మీద 46 శాతం పోలింగ్ అయినట్టు అధికారులు ప్రకటించారు. మందకొడిగా సాగిన పోలింగ్ ఈసారి కూడా తగ్గుముఖం పట్టడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తోంది. బస్తీలలో ఎక్కువశాతం ఓట్లు పోలవడం, కాలనీల ఓట్లు, రైల్వే ఓట్లు అంతంతమాత్రంగా పోలవడంతో ఏ పార్టీ అభ్యర్థులకు ఎంతమేర లాభం చేకూరుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సికింద్రాబద్ నియోజకవర్గం పరిధిలో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లలో మినహా ఎక్కడా చెప్పుకోదగిన పోలింగ్ జరగలేదు. సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్లు గా ఉన్న రైల్వే కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఎప్పటి మాదిరిగానే పోలింగ్ స్టేషన్లకు రాలేదు. ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ఇంటింటికీ పోల్ చీటీలు పంపిణీ చేయకపోవడం కారణంగా పలువురు బస్తీ వాసులు సైతం పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేకపోయారు. మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల సుడిగాలి పర్యటనలు నియోజనవర్గంలో పోలింగ్ సమయంలో కొనసాగాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్, బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి ముగ్గురు ఐదు డివిజన్లలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం నుంచి ఎన్నికల అధికారులు సీసీ కెమెరాలను అనుసంధానం చేసుకుని పోలింగ్ జరుగుతున్న తీరును సమీక్షించారు. సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి నేతృత్వంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు ఎదురైన పోలింగ్ ఇబ్బందులను తొలగించారు.



సాయంత్రం 5 తర్వాత అల్లావుద్దీన్‌కోఠిలో బారులుదీరిన ఓటర్లు

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గంలోనూ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం 249022 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 5 గంటల వరకు 45.10 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం గడువు ముగిసిన తర్వాత కూడా పలు పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు బారులుదీరారు. ముఖ్యంగా అల్లావుద్దీన్ కోఠి కమ్యూనిటీహాల్‌లో 223 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 5 గంటలయ్యే సరికి క్యూలైన్లలో దాదాపు 400 మంది వరకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచి ఉండడం కనిపించింది. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునే సరికి రాత్రి 9 గంటలు దాటే పరిస్థితి నెలకొంది. ఇక్కడి బూత్‌లో ఈవీఎం కొద్దిసేపు పనిచేయకపోవడంతో ఓటింగ్ ఆలస్యమైంది. ఇదిలా ఉండగా వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించినప్పటికీ చాలామంది దరఖాస్తు చేసుకున్నా ఆ అవకాశం లభించలేదు. దీంతో గత్యంతరం లేక కష్టాలు పడుతూ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం కనిపించింది. బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీయడం కనిపించింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ పలు పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకుని పోలింగ్ తీరును పరిశీలించారు.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సగానికి పైగా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. షరామామూలుగానే తక్కువ సంఖ్యలో ఓటింగ్ జరిగింది. నియోజకవర్గం వ్యాప్తంగా 250733 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి వరకు 49.14 శాతం (123210) ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఉదయం 7.00 గంటలకు పోలింగ్ మొదలవ్వగా, 9.00 గంటల వరకు కేవలం 5.1 శాతం మంది మాత్రమే ఓటేశారు. 11.00 గంటల వరకు మరో పదిశాతం పోలవగా 15.7 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడో రౌండ్ పూర్తవగా 27.7 శాతం ఓటింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3.00 గంటల వరకు, 37.89 శాతం, సాయంత్రం 5.00 గంటల వరకు 47.14 శాతం పోలైంది. ఓటింగ్ ముగిసే సమయానికి 49.14 శాతం ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌ను కూడా కలిపితే ఓటింగ్ శాతం మరికొంత పెరిగే అవకాశముంది.

ఓయూ స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గాల ఈవీఎం బాక్సులను భద్రపరిచారు. గురువారం ఎన్నికలు ముగిసిన తర్వాత సిబ్బంది ఈవీఎం బాక్సులతో ఓయూకు చేరుకున్నారు. దూరవిద్య కేంద్రంలో సికింద్రాబాద్ నియోజకవర్గం, ఎంబీఏ కాలేజీలో సనత్‌నగర్ నియోజకవర్గాల ఈవీఎం బాక్స్‌లను చేర్చారు. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరగనున్నాయి. ఓయూ స్టేషన్ పరిధిలో 53 కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు సీఐ పి.ఆంజనేయులు పేర్కొన్నారు.

ఏ ఎన్నికైనా వారంతే..

లాలాపేట: ఎన్నికలు ఏవైనా తార్నాక వాసులు దూరంగానే ఉంటూ వస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన ఎన్నికల్లో ఈ ప్రాంతంలో 40 నుంచి 42 శాతం వరకు ఓటింగ్ పోలైనట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు గాని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇలా ప్రతి ఎన్నికలో తార్నాక ప్రాంతం నుంచే అత్యల్పంగా పోలింగ్ నమోదవుతోంది. ఈ సారి ఓటింగ్ శాతాన్ని పెంచాలని నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, తార్నాక వెల్ఫేర్ అసోసియేన్ల సభ్యులు అవగాహన కల్పించిన అనుకున్నంతగా పెరగలేదు.



ఓటు హక్కును వినియోగించుకున్న పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులు



సిరా గుర్తు చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సంతోష్‌కుమార్



ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి



కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసేందుకు వస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్



ఓటేసిన బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



సిరా గుర్తు చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమ



ఓటు హక్కును వినియోగించుకున్న లాస్య నందిత



ఓటేసి సిరా గుర్తు చూపుతున్న మంత్రి మల్లారెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న శ్రీగణేశ్

నర్సింగ్ రావు మృతి తీరని లోటు

కవాడిగూడ: ముషీరాబాద్ విలేకరి, జర్నలిస్టు సంఘం నేత ఎర్రం నర్సింగ్‌రావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఎర్రం నర్సింగ్ రావు దశదిన కార్యక్రమానికి హాజరైన మామిడి సోమయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నర్సింగ్‌రావు జర్నలిస్టుగానే కాకుండా సామాజిక సేవకుడిగా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. హైదరాబాద్ జర్నలిస్టు యూనియన్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తదితర సంఘాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం అత్యంత బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పత్రికా యాజమాన్యం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని మామిడి సోమయ్య కోరారు. కార్యక్రమంలో నాయకులు బి. బసవపున్నయ్య, ఆనందం, చంద్రశేఖర్, రామారావు, బొల్లం శ్రీనివాస్, ఎం. నర్సయ్య, వీరారెడ్డి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రం నర్సింగ్‌రావు చిత్రపటానికి నివాళులర్పించిన మామిడి సోమయ్య తదితరులు

పేరు అతనిది.. ఫొటో ఆమెది

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని కేశవ్ మెమోరియల్ కాలేజీలో పోలింగ్ బూత్ నం .18 లో ఓ వ్యక్తి ఓటు వేయకుండాలనే వెనుతిరిగాడు. గాంధీకుటీర్ ప్రాంతానికి చెందిన కుమార్ జురిగల అనే వ్యక్తి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. తన ఓటరు కార్డు చూపించి ఓటరు జాబితాలోని స్లిప్ తీసుకునే క్రమంలో తన ఫొటో ఉండాల్సిన స్థానంలో మహిళ ఫొటో ఉండడంతో కంగుతిన్నాడు. దీంతో తాను ఓటు వేయకుండానే వెళ్లిపోయాడు.



మ్యాట్రిస్ పేరుతో రూ. 15 లక్షలు స్వాహా

ఆర్థో మ్యాట్రిస్ విక్రయిస్తామంటూ సైబర్ నేరగాళ్ల టోకరా

హిమాయత్‌నగర్: ఓఎల్ఎక్స్‌లో ఆర్థో మ్యాట్రిస్ అమ్మకానికి పెట్టి రూ. 15 లక్షలు టోకరా వేశారు సైబర్ నేరగాళ్లు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ వ్యక్తి ఓఎల్ఎక్స్‌లో మ్యాట్రిస్ విక్రయించే ప్రయత్నం చేశాడు. అయితే తక్కువ ధరకు ఆర్థో మ్యాట్రిస్ అమ్మకానికి ఉందని ఆగంతకులు పెట్టిన పోస్ట్‌ను చూశాడు. మ్యాట్రిస్ పేరుతో సైబర్ కేటుగాళ్లు పెట్టిన ఓఎల్ఎక్స్ అకౌంట్‌లో చాట్ చేశాడు. దీంతో తక్కువ ధరకు వస్తుందని ఆశపడ్డాడు. ఆన్‌లైన్ ద్వారా డబ్బు పంపిస్తే మ్యాట్రిస్ డెలివరీ చేస్తానని నమ్మించారు. వారు చెప్పిన విధంగా క్యూఆర్ కోడ్ సహాయంతో మొదట రూ. 10 ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం ఆగంతకులు చెప్పిన మరో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో బాధితుడి బ్యాంకు ఖాతాలోని రూ. 15 లక్షల సైబర్ కేటుగాళ్లు కాజేశారు. అకౌంట్లో ఉన్న డబ్బు ఖాళీ కావడంతో, ఓఎల్ఎక్స్‌లో మోసపోయానని బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఏసీపీ సూచించారు.





పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న మంత్రి





ఓటు హక్కు వినియోగించుకున్న ధరంరాజ్ చౌదరి దంపతులు



తార్నాకలో ఓటు హక్కు వినియోగించుకున్న రామ్‌చందర్‌రావు



ఓటు హక్కును వినియోగించుకున్న మోతే శ్రీలత శోభన్‌రెడ్డి



సిరా గుర్తు చూపుతున్న 90 ఏళ్ల ఉమ్రావ్‌బాయి సురానా





వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న వలంటీర్లు



సిరా గుర్తు చూపిస్తున్న రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ దంపతులు



వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న ఎన్నికల సిబ్బంది



నాగార్జున నగర్‌లో ఓటేసిన బండా కార్తీకచంద్రారెడ్డి కుటుంబం



ఓటేసిన సీఈవో మధుకర్ నాయక్



కుటుంబ సభ్యులతో కలిసి ఓటేసిన సదా కేశవరెడ్డి



లాలాపేటలో తొలిసారి ఓటేసిన దేవిజ్ఞానేశ్వరి



ఓటింగ్ కోసం వస్తున్న ఓ వృద్ధురాలు



తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లోని బూత్‌ను సందర్శించిన రాష్ట్ర ఎన్నికల నోడల్ అధికారిణి శైలజ



ఓటేసిన తార్నాక వాసులు



బోయిన్‌పల్లిలో తన ఓటు హక్కు వినియోగించుకున్న మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి